క్లుప్తంగా

గాలికుంటు వ్యాధిని నివారిద్దాం


గేదెకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న ఏడీఏ ప్రతాప్

రాజంపేట రూరల్ : పశువులకు టీకాలు అందజేసి డివిజన్ పరిధిలో గాలికుంటు వ్యాధిని నివారిద్దామని పశుసంవర్ధక శాఖ డివిజనల్ ఉపసంచాలకులు (డీడీ) డాక్టర్ వై.విజయభాస్కర్‌రావు పాడి రైతులను కోరారు. పట్టణ పరిధిలోని రామ్‌నగర్‌లో బుధవారం జాతీయ గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా పశువులకు టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. దాదాపు 146 పశువులకు టీకాలు వేశారు. అదే విధంగా 28 బ్రూసెల్లోసిస్ టీకాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గాలికుంటు నివారణ టీకాలు వేయించుకుంటే పాలదిగుబడి తగ్గుతుందనే అపోహను నమ్మవద్దన్నారు. టీకాలు పశువులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ డాక్టర్ కె.ప్రతాప్, అత్తిరాల పశువైద్యాధికారి డాక్టర్ కె.భాగ్యవతి, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి


ధూమపాన అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండలంలోని దళవాయిపల్లి పాఠశాలలో బుధవారం ధూమపాన రహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ధూమపానం వినియోగంతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ ధూమపానం వల్ల కలిగే అనర్థాలు గురించి ప్లకార్డులతో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకు వాడకం వల్ల వచ్చే వివిధ అనారోగ్యాలు గురించి తెలియజేశారు. పొగాకు నుంచి దూరంగా ఉండటం మంచిదని ఆయన సూచించారు.

ఇ-పంట వివరాలను సరిచూసుకోవాలి


క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఏఓ సుబ్రమణ్యం

పెనగలూరు : మండలంలోని కోడిచెన్నయ్యగారిపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఈ రబీ సీజన్‌లో రైతులు వేసిన అన్ని పంటలను ఇ- పంటలో నమోదు చేయించిన రైతుల వివరాలు ఆయా కేంద్రాలలో ప్రదర్శించడం జరిగిందన్నారు. పంట వివరాలు తప్పులు ఉన్నట్‌లైతే సిబ్బందికి తెలియజేసి సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఓబులవారిపల్లె : బాలబాలికలు 12 నుంచి 18 సంవత్సరాలలో ఎదుగుదలపై అవగాహన అవసరమని తహసీల్దార్ శ్రీధర్ రావు పేర్కొన్నారు బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర్ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రావు మాట్లాడుతూ ఎదుగుతున్న బాలబాలికలకు శరీరంలో కలిగే మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు మండల కేంద్రంలో ర్యాలీ చేసి స్థానిక స్టేట్ బ్యాంక్ కూడలిలో మానవహారంగా నిలుచున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనసూయమ్మ గుణవతి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్ట్‌పై కేసు నమోదు

రాయచోటి : రాయచోటిలో ఇటీవల జరిగిన ఉద్రిక్త పరిస్థితులను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన షేక్ జాకీర్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జహీర్ అహ్మద్ తెలిపారు. రాయచోటి కేంద్రంగా వర్గాల మధ్య నెలకొన్న పరిస్థితిని ప్రేరేపితం చేస్తూ వాట్సాప్‌లలో పోస్టులు చేశారని చెప్పారు. ఈ మేరకు బుధవారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఐటీ యాక్ట్ నిబంధనల మేరకు కేసు నమోదు చేశామన్నారు. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే రీతిలో ఎవరు పోస్టులు పెట్టిన, అసత్య ప్రచారం చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఊరించిన పూతలు.. ఉసూరుమనించిన పిందెలు

- ఉగాది సమీపిస్తున్న కానరాని పిందెలు
- నిరాశలో మామిడి రైతులు
- ప్రత్యామ్నాయ వ్యవసాయమే మేలంటున్న మండల రైతాంగం


పూత విరబూసిన మామిడి చెట్టు


పూత, పిందె రాలిపోవడంతో పుల్లలు మిగిలిన మామిడి చెట్టు

చిట్వేలి : ఈ ఏడాది మామిడి పూతలు ఆలస్యంగా వచ్చాయి. చెట్టు అంతా పూతలు విరబూసి ఊరించాయి. తీరా చూస్తే పూతలు రాలిపోయి పిందెలు పడకుండా పుల్లలు మిగిలి కాపు ఉసూరుమనిపించిందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో శివరాత్రికి శివలింగమంత పింది, ఉగాదికి ఊరగాయకు పనికివచ్చే అంత కాయ ఉండేది. ప్రస్తుతం అందుకు విరుద్ధంగా శివరాత్రికి పూతలు, ఉగాదికి పిందెలు అన్న చందంగా పరిస్థితులు మారిపోయాయి. పూతలు ప్రారంభమైనప్పటి నుంచి పురుగు, తెగుళ్ల నివారణకు ఇప్పటికే నాలుగు నుంచి ఐదు దఫాలు మందులు పిచికారీ చేశామని అయినా ఇప్పటికీ 25శాతం కూడా పిందెలు నిలబడలేదని మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా కాపు బాగా ఉన్నప్పుడు ధరలు లేవు. కాపు లేనప్పుడు ధరలు లేవు. వీటికి తోడు తెగుళ్లు అధికం కావడంతో నాణ్యత లేకపోవడం, పండు ఈగ ప్రభావం, రైతులను దోచుకోవడానికి అలవాటుపడిన దళారీ వ్యవస్థ ఏకమై రైతులను నిలువునా ముంచాయన్నారు. దీంతో పెట్టుబడి చేతికిరాక అప్పులు పాలై అడుక్కుతినే పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. గత ఏడాది వర్షాలు బాగా పడ్డాయి, కాలువలు, ఏరులు కళకళలాడాయి. వాతావరణం బాగుంది, కాపు బాగా వచ్చి తమను గట్టెక్కిస్తాయని ఆశపడిన మామిడి రైతులకు నిరాశే మిగిలింది. ఈ ఏడాది కొన్ని చెట్లకు పూత రాకుండా చిగురులు తొడిగాయి. మరికొన్ని చెట్లు పూతలు విరబూసినా పిందెలు అరకొరగా నిలిచాయి. ఈ ఏడాదీ తమకు అప్పులు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వ్యవసాయం వ్యర్థమని మామిడి తోటలు లాభసాటి అని వ్యవసాయ యోగ్యమైన, సారవంతమైన భూముల్లో సైతం మామిడిని సాగు చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా మామిడి తోటలు వ్యర్థం, వ్యవసాయం కొంత మేలు ఉన్న స్థితిలో తోటలను నరకడం మొదలుపెట్టారు. ప్రస్తుతం మండలంలో సుమారు పదివేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. అయితే వీటివల్ల ప్రతి యేడు నష్టాలు చవిచూడటం కన్నా నరికివేసి ప్రత్యామ్నాయం చూసుకోవాలని రైతులు భావిస్తున్నారు. దీంతో వచ్చే ఏడాది మండలంలో సగానికి పైగా మామిడి తోటలు నరికివేతకు గురయ్యే పరిస్థితులు దాపురించాయని రైతులు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మామిడి సాగుకు రాయితీలు ఇచ్చి దళారీ వ్యవస్థను నివారించాలని, అలాగే గిట్టుబాటు ధర నిర్ణయించి తమకు న్యాయం చేయాలని మామిడి రైతులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ వ్యవసాయం..



ప్రతి యేడు నష్టాలను మిగిలిస్తున్న మామిడి సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల సాగువైపు రైతు మొగ్గుచూపుతున్నారు. దీంతో మామిడి తోటలను నరికివేయడం తప్పడం లేదు. మామిడి సాగును నమ్ముకుంటే అప్పుల్లో మునిగిపోవడం ఖాయం. తోటలను నరికివేయక తప్పని పరిస్థితి వచ్చింది.

\- భాకరాపురం కొత్తపల్లి రైతు ఓబినేని కొండయ్య

ఎటు చూసినా నష్టాలే



ప్రకృతి అనుకూలించకపోవడం, అంతుబట్టని తెగుళ్లు ఆశించడం, సక్రమంగా కాపు రాకపోవడం, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఇలా అనేక రూపాల్లో రైతు నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి. ప్రతి ఏటా నష్టం చూసేకన్నా తోటలను నరికివేసి ప్రత్యామ్నాయ వ్యవసాయాన్ని అనుసరించడం మేలు అని భావిస్తున్నాం.

\- షేక్ టెంకాయల మహమ్మద్ ఖాసీం, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

సుండుపల్లె : మండల పరిధిలోని భైరవగుట్ట సమీపంలో ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు బుధవారం వాహనాల తనిఖీ చేస్తుండగా అక్రమంగా విక్రయానికి తరలిస్తున్న ఓ వ్యక్తి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు మండల కేంద్రానికి సమీపంలోని భైరవగుట్ట ఫారెస్ట్ చెక్‌పోస్టు దగ్గర ముడుంపాడు గ్రామ పంచాయతీ కురవపల్లికు చెందిన శ్రీను అనే వ్యక్తి పోలీసులను చూసి అనుమానంగా కనపడటంతో పోలీసులు అతనిని తనిఖీ చేయగా 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సుండుపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 14వ తేదీ శుక్రవారం రోజు మానవత సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరంలో పాల్గొనే వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. మండలంలోని ప్రజలందరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

ప్రజా శ్రేయస్సే వైఎస్సార్‌సీపీ లక్ష్యం


రైల్వేకోడూరు అర్బన్: కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న కొరముట్ల


రాజంపేట రూరల్: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, పార్టీ శ్రేణులు

- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు
- పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

రాజంపేట రూరల్ : రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం ఎన్నో పోరాటాల మధ్య ఆవిర్భవించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆకేపాటి భవన్‌కు అధిక సంఖ్యలో విచ్చేసిన నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు, కార్యకర్తలు 'జోహార్ వైఎస్సార్' 'జై జగన్' అంటూ నినదించారు. నాయకులు, కార్యకర్తల నినాదాల మధ్య వైఎస్సార్‌సీపీ జెండాను ఎమ్మెల్యే ఆకేపాటి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఒక పార్లమెంట్, ఒక శాసన సభ సభ్యులతో మొదలైన పార్టీ వైఎస్సార్‌సీపీ అని కొనియాడారు. నిత్యం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. అందుకే 151 స్థానాలతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలకు గుర్తుండి పోయే విధంగా పాలన సాగించిన మహోన్నత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని తెలియజేశారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మెడలు వంచి ప్రజలకు మేలు చేసే వరకు పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ వేడుకలలో మున్సిపల్ కౌన్సిలర్ పోలా శ్రీనివాసులరెడ్డి, సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, వివిధ విభాగాల కన్వీనర్లు పి.విశ్వనాథరెడ్డి, ఎస్.నవీన్‌కుమార్, ఎం.సురేఖ, డి.భాస్కరరాజు, జేవీ కృష్ణారావు, దండు గోపి, వద్దే రమణ, ఎ.సౌమిత్రి, జి.త్రినాథ్, మర్రి రవికుమార్, జి.బాలకృష్ణ, డి.పెంచలయ్య, ఎ.వరదరాజు, జీవీ సుబ్బారెడ్డి, కె.రమణారెడ్డి, కె.శేఖర్‌రెడ్డి, చొప్పా లక్ష్మికరరెడ్డి, ఏ.అశోక్‌కుమార్, డీలర్ సుబ్బరామిరెడ్డి, ఎ.మధుబాబు, కె.రెడ్డయ్య, ఎం.శ్రీనివాసులగౌడ్, ఓబయ్య, ఆర్‌సీ పెంచలయ్య, కె.శ్రీహరి, పోలి రఘునాథరెడ్డి, ఎస్.శివయ్య, జె.వేంకటరెడ్డి, జీవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. వేడుకల అనంతరం జిల్లా కేంద్రమైన రాయచోటిలో వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న 'యువత పోరు' కార్యక్రమంలో పాల్గొనటానికి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో బయలుదేరారు. ఈ వేడుకలలో పాల్గొనేందుకు వచ్చిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎమ్మెల్యే ఆకేపాటి స్వయంగా అల్పాహారం అందజేశారు.

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ వేడుకలు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం కార్యకర్తలు, నాయకులు, అభిమానుల నడుమ ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం ప్రధాన అంశాలుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. నిరంతర ప్రజలపక్షాన పోరాటాలే పార్టీకి పునాదులు అని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, వైద్యం, విద్య వ్యవస్థలు నిర్లయానికి గురయ్యాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాలు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, హరికృష్ణారెడ్డి, నందాబాల, బండారు మల్లి, దామర్ల సిద్దయ్య, ముజీబ్, కరీముల్లా, మారెళ్ళ రాజేశ్వరి, ఆర్వీ రమణ, శైలజ, చెంగల్‌రెడ్డి, సుబ్బరామరాజు, ప్రతాప్‌రెడ్డి, సిద్దూరాయల్, ఆంజనేయులు, గునిశెట్టిరమేష్, డీవీరమణ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యం


పోషకాహారాలను ప్రదర్శించిన సంస్థ సభ్యులు

సిద్ధవటం : పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా జీవించవచ్చని ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ రమా పైడమ్మ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం ఆవరణలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం (పోషణ్ మేళా) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా సంస్థ ఆధ్వర్యంలో ఐటీసీ, ఆశీర్వాద్ వారి సహాయంతో అందరూ ఆరోగ్యకరంగా ఉండాలని తెలియజేయడమే కాక వారి బరువు, ఎత్తు వివరాలను తెలుసుకుని ఎవరు ఏఏ పోషకారాలు తీసుకోవాలో తెలియజేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఆయోడిన్ లోపాన్ని అధికమించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పామన్నారు. ప్రజలకు మోటివేషన్ కోసం పోషక విలువల చక్రం ద్వారా స్నేక్ గేమ్స్, రింగుల ఆట ద్వారా ప్రజలను ఉత్సాహపరుస్తూ పోషణ్ మేళా నిర్వహించామన్నారు. అంతకుముందు పోషకాహారాలను ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ కో- ఆర్డినేటర్ ఈశ్వరయ్య, వారి సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్‌లు, పాఠశాల విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం.. వారిని ఎదగనిద్దాం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పుల్లంపేట : నేటి సమాజంలో ఆడపిల్లలు చదువుకోవడం ఎంతో అవసరమని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. బుధవారం మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆడపిల్లల చదువు ప్రాముఖ్యతను తెలిసేలా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చదువుతోనే ఆడపిల్లలకు రక్షణ, ఉన్నతస్థితి, సమాజంపట్ల అవగాహన ఉంటుందన్నారు. ఆడపిల్లలను చదివిద్దాం.. వారికి ఎదగనిద్దామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వారిపై వివక్ష చూపడం నేరమని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలు అనారోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. అనంతరం కిషోర్ వికాసం 2కే మారథాన్ ర్యాలీ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు సాగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మణెమ్మ, నాగలత, చెంచులక్ష్మీ, రోజ, జయలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటి ఆధ్వర్యంలో ఉచిత వివాహం


నూతన జంటను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి దంపతులు

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జ్యోతమ్మ దంపతులు నూతన జంటకు ఉచితంగా వివాహము జరిపించి వారిని ఆశీర్వదించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లోని దేవస్థానముల సముదాయంలో బుధవారం ఒంటిమిట్ట మండలం పెన్నా పేరూరు గ్రామానికి చెందిన అమ్మాయికి, సీకే దిన్నె మండలం కొప్పర్తి గ్రామానికి చెందిన అబ్బాయికి ఉచితంగా వివాహం జరిపించారు. కదిరి మనోహర్, ప్రసన్నల కుమార్తె హరిప్రియకు, బొల్లు జకరయ్య, మరియమ్మల కుమారుడు మరియ శేఖర్‌లకు ముందుగా ఆకేపాటి దంపతులు చీర, సారెతోపాటు తాళి బొట్టు అందించారు. అనంతరం వారికి దగ్గరుండి వివాహం జరిపించి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం వివాహానికి విచ్చేసిన బంధు, మిత్రులకు ఆకేపాటి విందును ఏర్పాటు చేశారు.

కనికాద్రమ్మను దర్శించుకున్న ఆకేపాటి

రాజంపేట రూరల్ : కనికాద్రమ్మ తల్లికి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పుల్లంపేట మండలంలో జరిగే కంప తిరునాలకు కనికాద్రమ్మ అమ్మవారి ప్రతిమను బుధవారం రాత్రి రాజంపేట మండలంలోని ఊటుకూరు శివాలయంలో తయారు చేసి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆకేపాటి అమ్మవారికి విశేషంగా పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలందరికి సుఖసంతోషాలను కల్పించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈనాడు శ్రీను, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి ఆటోలు నడిపితే కఠిన చర్యలు


ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

లక్కిరెడ్డిపల్లి : ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ఆటోలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్లకు బార్‌కోడ్ పీసీ నెంబర్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరమని, మద్యం సేవించి ఆటో నడపకుండా సకాలంలో గమ్యాన్ని చేరుకోవాలన్నారు. అలాగే ఓవర్ లోడ్ వేసుకోకూడదని, దీనివల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతాయని, ఆటో కెపాసిటీ ప్రకారమే ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ గోపీ నాయక్, సిబ్బంది సురేంద్ర యాదవ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు


వేడుకలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ యువత

లక్కిరెడ్డిపల్లె/రామాపురం : దిన్నెపాడు గ్రామంలోని దూదేకులపల్లెలో యువత ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. రామాపురం మండలం సుద్దమళ్ల గ్రామం యర్రమరెడ్డిగారి పల్లె లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి నివాసం వద్ద కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు సుబహాన్, రియాజ్, కాలేషా ఇస్మాయిల్, రఫీ, అల్లా బకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రహణం లేదు

కడప కల్చరల్ : శుక్రవారం చంద్రగ్రహణం లేదని జిల్లా అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు విజయ్ భట్టర్ స్పష్టం చేశారు. 14న చంద్రగ్రహణం ఉందని కొందరు చెప్పడంతో ఈ అంశం విస్తృతంగా ప్రచారమైందని, ఈ సందర్భంగా చేయాల్సిన పలు కర్మకాండలకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. నిజానికి మన దేశంలో 2025లో సూర్య, చంద్రగ్రహణాలు వర్తించవని స్పష్టం చేశారు.

మల్లూరమ్మ జాతరకు సర్వం సిద్ధం


జాతరకు ముస్తాబైన మల్లూరమ్మ ఆలయం


మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

చిన్నమండెం : మండలంలో ప్రసిద్ధిగాంచిన మల్లూరమ్మ జాతర నేటి నుంచి జరుగనుంది. జాతరను పురస్కరించుకుని ఆలయ సిబ్బంది, మండల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయాన్ని ముస్తాబు చేయగా, నేటి (గురువారం వేకువజామున ఒంటి గంట తరువాత) అర్ధరాత్రి జాతర ప్రాంగణానికి అమ్మవారిని తీసుకొచ్చే కార్యక్రమం జరగడంతో జాతర ప్రారంభం కానున్నట్లు ఆలయ పూజరి తెలియజేశారు. బుధవారం జాతరకు సంబంధించిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై చిన్నమండెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పోలీసులు సమీక్షించారు. ఇందులో డీఎస్పీ కొండయ్యనాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లిం సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో జాతరలు జరుపుకోవాలని సూచించారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ సుధాకర్‌ల ఆధ్వర్యంలో మల్లూరమ్మ, కేశాపురం, పాలేటమ్మ జాతరలకు సంబంధించి ఆయన సిబ్బంది పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల కోసం అనునిత్యం డ్రోన్ సాంకేతిక టెక్నాలజీ, సీసీ కెమెరాలతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేఖర్‌నాయక్, ఈఓ కొండారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ రాజేష్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, హిందూ, ముస్లింల మతపెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు నివాస స్థలాలివ్వాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లి : దిన్నెపాడు గ్రామ పరిధిలోని వడ్డిపల్లిలో అర్హులైన పేదలకు నివాస స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్రలు అన్నారు. బుధవారం స్థానిక ప్రజల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ప్రజల జీవితాలు మారడం లేదన్నారు. ఇందుకు నిదర్శనం అనేక దఫాలుగా నివాస స్థలాలు కావాలని అర్జీలు పెట్టుకున్నప్పటికీ ఏ ఒక్క అధికారి గానీ, ప్రజాప్రతినిధులు కానీ స్పందించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులైన పేదలందరికీ గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు, అలాగే నివాసాలు నిర్మించుకునేందుకు ప్రతి లబ్ధిదారునికి రూ.5 లక్షలు ఇవ్వాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకురాలు ప్రమీల, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శివశంకర్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిపాటు చదివి ఈనెల 17వ తేదీ నుంచి జరగబోవు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్ మరెన్నో ప్రభుత్వ కళాశాలలో సీట్లు సాధించవచ్చన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడాలని తెలియజేశారు. అనంతరం జానపద సినిమా పాటలకు విద్యార్థులు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ యనమల మణి, విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేయాలి


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ ఉషారాణి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మద్దిరేవుల కాకులవరం, బూడిద గుంటపల్లి గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రాలను, ఆయా పంచాయతీలలోని పారిశుధ్యం, సిబ్బంది పనితీరును మండల విస్తరణాధికారి ఉషారాణి బుధవారం ఉదయం పరిశీలించారు. మండలంలోని అన్ని పంచాయతీలలో కంటే మద్దిరేవుల ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో మద్దిరేవుల గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ జిల్లా అధికారులు గుర్తించారన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు అమ్మి వాటి ద్వారా వచ్చే డబ్బును గ్రామ పంచాయతీ అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలో వంద శాతం ఇంటి పన్నులు ప్రజల నుంచి వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శి రజనీష్ రెడ్డికి సూచించారు.